## కన్న తండ్రే కూతురి శీలాన్ని దోచుకున్న యదార్ధగాథ!

**అచ్యుతుని రాజ్యశ్రీ**

# మొండెం చిరునామా

రాత్రంతా వర్షం కురిసి ప్రకృతి అప్పుడే బాలభానుని బంగారు కిరణాల్ని పొదువుకుంటోంది. గోవిందపూర్ ప్రాంత ప్రజలు తమ దినచర్య ప్రారంభించారు. హఠాత్తుగా వారి ముక్కుపుటాలకి ఏదో దుర్వాసన సోకింది. దగ్గర్లో వున్న అడవిలో ఏదో జంతువు చచ్చిందని సరిపెట్టుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లో సముద్ర తీరాన వున్న గోవిందాపూర్ సమీపంలో అడవి వుంది. ఆ కళ్లకంపు రానురాను భరించలేనంతగా దుర్వాసన కొట్టడంతో కొంతమంది అడవిలోకి వెతుక్కుంటూ వెళ్లారు. ఓచోట కాకులమూక గోలగా అరుస్తూ కనబడింది. రాబందులు పైగా ఎగుర్తున్నాయి. అక్కడో తలలేని స్త్రీ మొండెం పడుంది. బాగా కుళ్లి కంపుకొడ్తోంది. ఈ విషయాన్ని వాళ్లు వెంటనే పోలీసాఫీసర్ బద్రుద్దీన్ కురేషీకి తెలపడం, ఆయన వెంటనే ఫోటోగ్రాఫర్‌తో, పోలీసుల్తో అక్కడకు రావడం జరిగింది. కురేషీ ఆ ప్రాంతాలన్నీ గాలించగా ఖరీదైన లేడీస్ షూస్ కనబడ్డాయి. ఒకదానిపై వైరుముక్క పడి వుంది. కురేషీ చాలాసేపు దాన్ని పరిశీలనగా చూసి ఏం తోచక శవాన్ని పోస్టుమార్టంకి పంపాడు. 9 అక్టోబర్ 1993నుంచి ఈ కేసు పని పట్టాలని తీర్మానించాడు. తల లేకపోవడంతో ఆ శవం గూర్చి ఆచూకీ తీయడం అసాధ్యం అవుతోంది. ఎక్కడా స్త్రీ మాయమైన కంప్లెయింట్ లేదుకూడా. అలా 15రోజులు గడిచాయి. పోస్టుమార్టంలో ఆ స్త్రీని ఏదో లోహపు త్రాడుతో గొంతు పిసికినట్లు, హత్యకి ముందు ఎంతోమంది ఆమెపై అత్యాచారం చేసినట్లు, ఆపై మొండాన్నుంచి తలని నరికేసినట్లు తేలింది. అప్పటికామె 7 నెలల గర్భిణీ కూడా! ఎంత కష్టపడైనా సరే ఆ క్రూర హంతకుల్ని పట్టుకుతీరాలనుకున్నాడు కురేషీ. శవం ఫోటోలు ఎందుకూ పనికిరాలేదు.



ఎందుకంటే అప్పటికే అది బాగా కుళ్లిపోయింది. పైగా తలకూడా లేదాయె! ఇక వేశ్యలు ఎక్కువగా వుండే లక్ష్మీనగర్‌లో ఎంక్వైరీ చేశాడు. 500 వేశ్యలున్న ఆ ప్రాంతంలో. సగంమంది పెళ్లయిన స్త్రీలు! కురేషీకి ఇక్కడా ఎలాంటి సమాచారం లభించలేదు. ఇందులోని ఏ స్త్రీకూడా మాయం కాలేదు. అయినా పాపం ఆయన ఇంకా ప్రయత్నించడంతో ఓ ఆధారం దొరికింది. హార్బర్

ప్రాంతంలోని ఓ యువతి హఠాత్తుగా మాయమైందని. అక్కడికెళ్లిన కురేషీ చుట్టుపక్కలవారిని విచారిస్తే శేఫాలీ విశ్వాస్ అనే ఆమె కన్పించడంలేదని తేలింది. అదో చిన్న ఫ్లాట్ తాళం వేసుంది. కురేషీ తాళం బద్దలు కొట్టి లోపలికి ప్రవేశిస్తే కొన్ని ఖరీదైన బట్టలు, ఇంట్లో అవసర సామగ్రి వున్నాయి. ఆయన తీక్షణమైన కళ్లకి ఒక ఇనుప తీగ కన్పడింది. ఆమె ఫోటో కోసం ఇల్లంతా గాలించినా దొరకలేదు. ఆమె రూపురేఖల్ని గూర్చి ఇరుగుపొరుగువారిని అడిగి కలకత్తాలోని ప్రసిద్ధ చిత్రకారుడైన మానిక్‌పాల్ దగ్గరకెళ్లి ఒక అమ్మాయి చిత్రాన్ని గీయాలి. ఆమెను చాలాసార్లు చూసినవాళ్లనీ దగ్గరకు తెస్తా. వారు చెప్పే వివరాలనుబట్టి కొంచెం ఆకారం తెచ్చావంటే హత్యారహస్యం తేలుతుందని రిక్వెస్టు చేయడం, అలాగే అతను బొమ్మవేయడం, దాన్ని ఆధారంగా కురేషీ సేకరించిన వివరాలివి. శేఫాలీ 'రాజా అండ్ సన్స్' అనే ఫ్యాక్టరీ మేనేజర్ పరిమళ్‌భద్రతో సన్నిహితంగా వుండేదని 8 నవంబర్ 1993న కురేషీ పరిమళభద్రని అరెస్టు చేశాడు. మొదట తనకేం తెలియదని బుకాయించాడు. కానీ పోలీసు తడాఖా చూసేటప్పటికి ఫ్యాక్టరీ వర్కర్లు దేవేష్ బారువా, ఆశీష్‌తో కల్సి ఆమెను హత్యచేసినట్లు ఒప్పుకున్నాడు. ఈ లోపల ఇంకో విచిత్ర సంఘటన జరిగింది. శేఫాలీ తండ్రి అనిమేష్ కుమార్ ఓ హోటల్ యజమాని కురేషీని కల్సి తన కూతురు ప్రాణాల్తో బ్రతికే వుందని, రెండుమూడు రోజుల క్రితమే పారిపోయిందనీ, తనతో ఫోన్‌లో మాట్లాడిందని, ఆ శవం తన కూతురిది కాదని వాదించాడు. సరే ఈ తడవ మీ అమ్మాయి దగ్గర్నుంచి ఫోన్‌వస్తే ఆమెను పోలీసులముందు హాజరుకమ్మని చెప్పండి'' అని అతడ్ని పంపేసి ఓ ఇద్దరు పోలీసుల్ని మఫ్టీలో అతడ్ని ఫాలో అవమని ఆదేశించాడు. కురేషీ ప్రయత్నం విఫలం కాలేదు. వింత హృదయవిదారక గాథ బైటపడింది.

మానవరూపంతో వున్న నరపిశాచుల కామానికి శేఫాలీ ఎలా బలి అయిందో చూడండి! దీఘా ప్రాంతంలో వున్న ఆ హోటల్‌లో పార్ట్‌నర్ అయిన అనిమేష్ ఆదాయం బాగా వుంది. భార్య చనిపోయింది. పెద్దకూతురి పెళ్లి అయింది. రెండో కూతురు శేఫాలీ పెళ్లికి రెడీగా వుంది. భార్య చనిపోయిన అనిమేష్ హోటల్‌లో పనిచేసే వితంతువు యోగేశ్వరిని ఉంపుడుగత్తెగా చేసుకున్నాడు. కానీ చిన్నారి శేఫాలీపై యోగేశ్వరి నిజమైన తల్లి ప్రేమే చూపింది. అన్ని విధాలా కంటికి రెప్పలా కన్నకూతురికన్నా మిన్నగా చూసుకునేది. శేఫాలీకి పెళ్లికొడుకుని వెతకమని పోరుపెట్టి, తనకు తెల్సిన ఓ సంబంధం కుదిర్చి శేఫాలీ కన్నతల్లి నగలేకాక తనవికూడా కొన్నిచ్చి ''అమ్మా! నీకేం కావాలన్నా నీ తల్లిని ఇక్కడున్నానని మరవకు'' అని అంపకాలు పెట్టింది. కానీ వరకట్న సమస్యతో శేఫాలీని అత్తింటివాళ్లు ఆరళ్లు పెట్టడం, ఆమెను పుట్టింటికి తరిమేయడం జరిగింది. పాపం పుట్టింట్లో చేరిన ఆమె సౌందర్యం నలుగురిని ఆకర్షించినా యోగేశ్వరి చల్లని నీడలో సేదతీరేది. 1992లో ఎవరో బంధువుల పెళ్లికి యోగేశ్వరి వెళ్లింది. ఒంటరిగా వున్న శేఫాలీ ఆరోజు బాత్రూంలో స్నానం చేస్తుండగా దగ్గరగా వేసున్న తలుపు తోసుకుని హఠాత్తుగా కాళ్లు చేతులు కడుక్కుందామని బాత్రూంలోకి అడుగుపెట్టిన తండ్రి అనిమేష్ బుద్ధి వక్రించి ఆమె శీలాన్ని దోచాడు! తిరిగి నంగనాచిలా హోటల్‌కెళ్లిపోయాడు. పాపం నిస్సహాయంగా శేఫాలీ రోదించసాగింది. అలా కుళ్లిపోతూ ఓ వారం గడిపింది. ఓరోజు అలా ఏడుస్తుండగానే యోగేశ్వరి తమ్ముడు నీలేశ్వర్ వచ్చి బుజ్జగిస్తూ కారణం అడగడం, తండ్రి పశుత్వాన్ని గూర్చి అమాయకురాలు అతనికి చెప్పడం, ఒక్క క్షణం నిశ్శబ్దంగా వున్న తనిలోకూడా రాక్షసుడు ఒళ్లు విరుచుకోవడంతో, ''నీ కన్నతండ్రే నీ శీలాన్ని

చెరిచాడు. నేను నీకు మామని'' అని తోడేలులా ఆమెపై అత్యాచారం జరిపాడు. ఇక ఈ అవమానం, అత్యాచారం భరించలేని ఆ అమాయకురాలు చేతిలో పైసా లేకుండా ఆవేశంతో ఇంట్లోంచి బైట ఎక్కడెక్కడికో పనికోసం తిరిగి తరమబడింది. ఓ టీ దుకాణంలో సాయంత్రం ఓ గ్లాసు మంచినీరిమ్మని బ్రతిమాల్తే షాపువాడు చీదరించుకున్నాడు. కానీ అక్కడే ఉన్న ఓ యువకుడు షాపువాణ్ని మందలించి టీ, బిస్కట్లు ఇప్పించాడు. ఆ వ్యక్తే పరిమళ్. అతడికి కృతజ్ఞతలు తెలిపింది. నాతో రా పని ఇప్పిస్తా'' అని పరిమళ్ తన ఇంటికి తీసుకెళ్లాడు భార్య స్నేహలత కూడా భర్తచేసే ఫ్యాక్టరీలోనే సేల్స్ రిప్రజెంటేటివ్‌గా వుంది. పైగా ఐదుగురు పిల్లలు ఆ దంపతులకి! శేఫాలీ కథ విన్న స్నేహలత సానుభూతి చూపించింది కానీ తనింట్లో వుంచుకోడానికి ఇష్టపడలేదు. పరిమళ్ ఆమెను తన మిత్రుడైన రంజిత్ దగ్గరకు తీసుకెళ్తే, తనింట్లో అట్టిపెట్టుకోడానికి రంజిత్ భార్య తిరస్కరించింది. చేసేదిలేక పరిమళ్ ఆమెను గోవిందపుర్‌లో ఓ ఇల్లు తీసుకుని అందులో వుంచాడు. అతని దయార్ద్ర హృదయానికి శేఫాలీ మొగ్గుచూపడం, క్రమంగా వారిమధ్య సంబంధం ఏర్పడడం జరిగింది. ఇక శేఫాలీ ఇంట్లోంచి పారిపోయిన సంగతి తెల్సుకున్న యోగేశ్వరి అనిమేష్‌ని గుచ్చి గుచ్చి అడిగింది. నాకేం తెల్సు? వయసులో వున్న కుర్రది ఎవడ్తోనన్నా లేచిపోయిందేమో. నువ్వు లేవుగా! నేనేమో హోటల్లో ఏడుస్తానాయె'' అని విసుక్కున్నాడు. ఆమె బలవంతంపై పోలీసు రిపోర్టు ఇచ్చానన్పించాడు. ఇక ఇక్కడ శేఫాలీ పరిమళ్‌తో సుఖంగా కాలక్షేపం చేస్తోంది. ప్రతి ఆదివారం అతనొచ్చి ఒకటి రెండురోజులు ఆమెతో గడిపేవాడు. కానీ క్రమంగా ఆమె అంటే మోజు తగ్గిపోవడంతో రావడం తగ్గించాడు. ఈలోపల శేఫాలీ గర్భవతినయ్యానని తెలుసుకుని ఓ లెటర్ వ్రాసింది అతని ఆఫీసుకి 'పర్సనల్' అని అంటూ. పరిమళ్ లేనప్పుడు అక్కడే ఉన్న స్నేహలత చేతిలో ఆ లేఖ పడడం, దాంట్లోని విషయం తెల్సుకున్న స్నేహలత భర్త పరిమళ్‌ని బెదిరించడం అతనికి శేఫాలీపై కోపం రావడం జరిగింది. తన గుట్టు బైటపడిందన్న కోపంతో ఆ మర్నాడే గోవిందపుర్ శేఫాలీ దగ్గరకెళ్లి ''సరే నా భార్య ఒప్పుకుంది. మా ఇంట్లో వుందువుగాని రా'' అని బైలుదేరతీశాడు. ఇది 7 అక్టోబర్ 93న జరిగిన సంఘటన. పాపం ఆమె అతనివెంట బైలుదేరింది. స్కూటల్ అడవిలోకి ప్రవేశించిన తర్వాత అతను స్కూటర్ స్లో చేయడం, నైలాన్ తాడు శేఫాలీపై పడడం, భయంతో అరుస్తూ ఆమె స్కూటర్‌మీదనుంచి క్రింద పడడం, అక్కడే పొంచివున్న దేవేష్, ఆశీష్ ఆమెపై అత్యాచారం చేసి ఇనుపతీగ, నైలాన్ దారంతోనే ఆమె మెడకి ఉచ్చు బిగించి తల నరికేసి ఓ చెర్వులో పడేయడం జరిగింది. కురేష్‌కి శవం లభించి ఎంక్వైరీ మొదలుపెట్టడంతో పరిమళ్ వెళ్లి ఆమె తండ్రి అనిమేష్‌ని బెదిరించాడు. ''ఆ శవం నీ కూతురుదని చెప్పావో, నీ కూతుర్ని నీవే చెరిచావని ఊరంతా డప్పు కొడ్తా''. అంతే బెదిరిన అనిమేష్ కురేషీ దగ్గరకొచ్చి ''శేఫాలీ బ్రతికే వుందని, తనకు ఫోన్ చేసిందని నాలుగు కల్లబొల్లి కబుర్లు చెప్పాడు. కురేషీ అతడ్ని అనుమానించడం ఇక కథంతా మీకు తెలిసిందే. ఇంతకీ ప్రస్తుతం పరిమళ్, దేవేష్ జైల్లో కటకటాలు లెక్కపెడుతుంటే ఆశీష్ మాత్రం ఇంతవరకు చిక్కలేదు. కానీ నిజమైన నీచులైన తండ్రి అనిమేష్ మామ వరసైన నీలేశ్వర్ అనే గోముఖవ్యాఘ్రాలు మాత్రం ఘరానాగా తిరగడం మన చట్టంయొక్క లోపాన్ని ఎత్తి చూపడంలేదా? ఇలాంటి అత్యాచారాలకి బలైన కన్నీటితో అలమటించే అభాగినులెందరో మనకు తెలీదు మరి!